సూర్య ఉదయం
తెలుగు దిన పత్రిక
శనివారం 22 -08 -2026

# 22ఏ భూముల సమస్యపై నాయకుల సమీక్ష

**ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం: మాధవరం కృష్ణారావు**








**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కే.పి.హెచ్.బి డివిజన్ ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 22ఏ భూముల సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొని బాధితుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా నిరంకుశంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా పట్టా భూముల్లో నివసిస్తున్న ప్రజల ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అన్ని ఆధారాలు, హక్కు పత్రాలు ఉన్న భూములను 22ఏలో చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భూముల సమస్యపై వారి తరఫున ఉధృతమైన పోరాటం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజలకు అండగా ఉండాలే తప్ప గుదిబండగా మారకూడదని అన్నారు. అన్ని ఆధారాలు ఉన్న భూములను 22ఏ జాబితాలో ఎలా చేర్చుతారని ప్రశ్నించారు. ఈ నిర్ణయం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సైతం సమస్యను పట్టించుకోనట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు.ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అన్నారు. అవసరమైతే ప్రజల కోసం ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని ప్రకటించారు. 22ఏ భూముల సమస్య పరిష్కారం అయ్యే వరకు బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు తాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు, పార్కులు, రహదారులు, ప్రజా రవాణా వంటి అనేక సదుపాయాలు కల్పించామని నాయకులు పేర్కొన్నారు. కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టకుండా భూములపై దృష్టి సారిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూదందాకు పాల్పడుతున్నారని నాయకులు ఆరోపించారు. ప్రజల భూముల విషయంలో ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబీహా గౌసుద్దీన్, పగడాల శిరీషా బాబు రావు, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, శేరిలింగంపల్లి నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మిలాద్ నబీ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

**ఊరేగింపు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు డా. ఎం. రమేష్**



**సూర్య ఉదయం ప్రతినిధి, కుత్బుల్లాపూర్ :** మిలాద్ నబీ పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న ఊరేగింపును దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో విస్తృతంగా పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. జగద్గిరిగుట్ట, సూరారం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఊరేగింపు సాగే మార్గాన్ని సీపీ పరిశీలించారు. మార్గంలోని రహదారులు, ట్రాఫిక్ పరిస్థితులు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించి, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ పోలీసు అధికారులతో సమావేశమై మిలాద్ నబీ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఊరేగింపు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని సమర్థవంతంగా మోహరించి, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.తదుపరి కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని సీసీఎస్, ఎస్ఓటీ కార్యాలయాలను సీపీ సందర్శించారు. ఆయా విభాగాల పనితీరు, భద్రతా అంశాలు, పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసులు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గాజులరామారం ప్రాంతంలో సైబరాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు పనులను సీపీ పరిశీలించారు. పెట్రోల్ బంకు ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితి, మౌలిక వసతులు, చేపట్టాల్సిన తదుపరి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సైబరాబాద్ పోలీస్ కార్ హెడ్‌క్వార్టర్స్ కోసం ప్రభుత్వం నూతనంగా కేటాయించిన స్థలాన్ని సీపీ పరిశీలించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, కుత్బుల్లాపూర్ అదనపు డీసీపీ పురుషోత్తం, ఏసీపీ పబాల గంగిరెడ్డి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సాతనూరులో ఆధ్యాత్మిక శోభతో 'మిలాద్-ఉన్-నబీ






**ఆగస్టు 26 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** కోసిగి మండలం సాతనూరు గ్రామంలో ఈద్ మిలాద్-ఉన్-నబి పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక జమాతే మరియు వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు గ్రామ వీధుల్లో వైభవంగా జరిగాయి. కమిటీ నాయకులు, ముస్లిం సోదరులు సాతనూరు వీధుల్లో ప్రవక్త దివ్య సందేశాలను చాటుతూ ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని మసీదులో లోకకల్యాణం, శాంతి మరియు సామరస్యం వర్ధిల్లాలని కోరుతూ జమాతే నాయకులు ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు.: ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రవక్త చూపిన దయ, కరుణ, మరియు సోదరభావం మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ వేడుకల్లో జమాతే, వక్ఫ్ బోర్డు కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## రహదారి బాగు చేసిన పోలీసులు ఊపిరి పీల్చుకున్న ఉరుకుంద రోడ్డు ప్రయాణికులు



**ఆగస్టు 26 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** ప్రజల భద్రతే ధ్యేయంగా కోసిగి సీఐ మంజునాథ్ నేతృత్వంలో, ఎస్సై రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సత్వర చర్యలు చేపట్టాయి. ఉరుకుంద అర్చ్ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రహదారి పక్కన మట్టి కుంగిపోయి, నిత్యం వాహన దారులకు ప్రమాదకరంగా మారిన ప్రదేశాన్ని గుర్తించి పునరుద్ధరించారు.సదరు ప్రాంతంలో భారీగా మట్టిని వేయించి, రోడ్డును సమతలంగా చదును చేయించారు. ఈ సత్వర చర్యతో రహదారి తాత్కాలికంగా సురక్షిత వినియోగానికి సిద్ధమైంది.కుంగిన ప్రదేశాన్ని పూడ్చడంతో వాహనదారులు, పాదచారులు ఎలాంటి భయం లేకుండా ప్రయాణించే అవకాశం లభించింది. రహదారిని బాగు చేసినప్పటికీ, మలుపులు మరియు పూడ్చిన ప్రాంతాల వద్ద ప్రమాదాలు జరగకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పోలీసులు కోరారు.

## నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** బాలానగర్ డివిజన్ యువమోర్చా నాయకులు పద్మారావు, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు మాణిక్ ఆహ్వానం మేరకు నిర్వహించిన నూతన గృహప్రవేశ వేడుకలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహంలో కొలువుదీరిన సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పద్మారావు, మాణిక్‌లను అభినందించి, నూతన గృహప్రవేశం సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపాదారు. తమ ఆహ్వానాన్ని మన్నించి గృహప్రవేశ వేడుకకు విచ్చేసినందుకు పద్మారావు, మాణిక్‌లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావును ఘనంగా శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్ ఆంజనేయ నగర్ రెసిడెన్స్ ఎన్నికల్లో జె. మహేందర్ ప్యానెల్ ఘనవిజయం

**కాలనీ అభివృద్ధికి సహకరిస్తా: వడ్డేపల్లి రాజేశ్వరరావు**



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి, :** ఆంజనేయ నగర్ రెసిడెన్స్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన జె. మహేందర్ ప్యానెల్ సభ్యులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈూ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన జె. మహేందర్ ప్యానెల్ సభ్యులను వడ్డేపల్లి రాజేశ్వరరావు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆంజనేయ నగర్ కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, కాలనీవాసుల సంక్షేమం కోసం నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కాగా, కాలనీ సభ్యులు భద్రతా సమస్యలను వడ్డేపల్లి రాజేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదని, భద్రతా పరంగా మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు కాలనీవాసుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇవ్వడంతో పాటు, అందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కాలనీవాసుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అందరి సహకారంతో ఆంజనేయ నగర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శేఖర్ గుప్తా, జె. మహేందర్ ప్యానెల్ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో మహేంద్ర వర్గం విజయం

**నూతన ప్యానెల్‌కు అభినందనలు తెలిపిన బండి రమేష్**




**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి, కైత్లాపూర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన మహేంద్ర ప్యానెల్ సభ్యులు గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేంద్ర సారథ్యంలో ప్యానెల్ సభ్యులు బండి రమేష్‌ను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో తమ ప్యానెల్ విజయానికి అన్ని విధాలుగా అండగా నిలిచి, మద్దతు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ నూతన అధ్యక్షుడు మహేంద్రతో పాటు ప్యానెల్ సభ్యులను అభినందించారు. కాలనీలోని ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాలనీ అభివృద్ధికి సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మహేంద్ర ప్యానెల్ విజయానికి అన్ని విధాలుగా సహకరించిన కూకట్‌పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్క పెంటయ్య, జిట్టా సునీల్ కుమార్ యాదవ్‌లకు కూడా సంక్షేమ సంఘం నూతన సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారం, మద్దతు తమ విజయానికి ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నారు.

# సిగ్నస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

**అందుబాటు ధరల్లో మెరుగైన వైద్యం అందించాలి బండి రమేష్**



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** సర్దార్ పటేల్ నగర్, నిజాంపేట్ క్రాస్‌రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిగ్నస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలని బండి రమేష్ అన్నారు. ఆసుపత్రి మరింత అభివృద్ధి చెంది ప్రజలకు విస్తృత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, మాకినేని వినోద్, శ్రీనివాస్ బాబు, సత్యనారాయణ, గాదె శివ తదితరులు పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

**శాంతి, ప్రేమ, సోదరభావాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలి: బండి రమేష్**






**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. అరవింద్ కిశోర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి గొప్ప విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు. సమాజంలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, ఐక్యతతో కలిసి మెలిసి జీవించాలని ఆయన ఆకాంక్షించారు. మత సామరస్యం, సోదరభావం మరింత బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మైనార్టీ నాయకులు దండుగుల యాదగిరి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మాకినేని వినోద్, కిరణ్ గౌడ్, నల్లోల్ల రాజేందర్, శివ యాదవ్, విజయ్ కాంత్ రెడ్డి, రాకేష్ గౌడ్, అంజద్, ముస్తఫా అలీ, ఆదిల్ పఠాన్, మున్ను, దీపక్, సతీష్ పటేల్, అస్లాం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలి

**దేశ అభివృద్ధిలో యువతదే కీలకపాత్ర ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** బాలానగర్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం బాలానగర్‌లోని బాప్తిస్ట్ చర్చిలో యువజన కూడిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు దేవిడ్‌తో పాటు పలువురు పాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. యువత క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన ఆలోచన, కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటే జీవితంలో అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించగలరని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను చేరుకుని దేశానికి, కూకట్‌పల్లి నియోజకవర్గానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. యువతకు ఆ దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆకాంక్షించారు. యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి సమాజ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు గిరిబాబు, విజయబాబు, దినకరన్, కిషోర్, జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**శాంతి, సోదరభావం, మానవతా విలువలను ఆచరించాలి**



**సూర్య ఉదయం ప్రతినిధి, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రోడా మేస్త్రి నగర్ డివిజన్‌లో మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, పరస్పర గౌరవంతో కలిసి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మతసామరస్యంతో కలిసిమెలిసి జీవించాలని ఆయన కోరారు. శాంతి, ఐక్యత, సోదరభావం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం మైనార్టీ మత పెద్దలు, స్థానిక నాయకులు జహంగీర్, సలీం, రషీద్, షాకీర్ తదితరులతో పాటు ముస్లిం యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

